వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- సమస్యలపై స్పందించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి



హాజరైన ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంపై సకాలంలో స్పందించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్లు నిధులు మంజూరు చేస్తే ఆ నిధులతో చేపట్టిన పనులకు అధికారులు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. పట్టణంలో శానిటేషన్ విషయంలో కూడా ప్రజల నుంచి ఫిర్యాదు వస్తున్నాయని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పద్ధతి మార్చుకుని సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పన్ను వసూళ్ళపై దృష్టి సారించాలని కోరారు. పురప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పురపాలక సాధారణ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో సీసీ కెమెరాలు మరమ్మతు చేయించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

గత సమావేశాల్లో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా మళ్ళీ సమావేశం వచ్చేనాటికి కూడా అధికారులు వాటిని పరిష్కరించడం లేదని ఆయా వార్డుల కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను అధికారులు చెల్లించడంలేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మూడు నెలల క్రితం మున్సిపాలిటీకి నూతన జేసీబీ మంజూరైతే ఇంత వరకు సంబంధిత సంస్థకు బిల్లు మంజూరు చేయలేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారని, కాంట్రాక్టర్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారని 26వ వార్డు కౌన్సిలర్ పుత్తామహేష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాల వలన బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. 7వ వార్డులో డ్రైనేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ సమత, 23వ వార్డులో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ పరిష్కరించలేదని ఆ వార్డు కౌన్సిలర్ కరీముల్లా, 16వ వార్డు పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రులలోని వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కౌన్సిలర్ లింగాలమణి, 5వ వార్డులో గేట్‌వాల్ లీకేజీతో నీరంతా వృథాగా పోవడంతో పాటు రోడ్లు బురదమయంగా మారుతున్నాయని, గేట్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆ వార్డు కౌన్సిలర్ రత్నమ్మ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటిపై స్పందించకుంటే నోటీసులు ఇవ్వాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. తక్షణమే పనులను చేయిస్తామని కమిషనర్ చెప్పారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మునికుమార్, ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అల్లాడుపల్లెలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయం వద్ద సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010–2016 మధ్య ఆధార్ పొందిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. రేషన్, పాన్, ఓటర్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం ఇలా ఏదేని గుర్తింపు కార్డుతో ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో అల్లాడుపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ కోరారు.

27 నుంచి టంగుటూరు సచివాలయంలో

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ సచివాలయంలో 27, 28, 29 తేదీల్లో ఆధార్ అప్డేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు, చేర్పులతోపాటు సెల్ నంబర్ లింక్ చేయించుకోవచ్చని వివరించారు. ఆధార్ కార్డు ఉన్న వారంతా టంగుటూరు సచివాలయానికి వెళ్లి అప్డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం

- మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీలో
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అక్కచెల్లెమ్మల ఆశీర్వాదంతో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు అధ్యక్షతన 22వ వార్డు నుంచి 33వ వార్డులకు సంబంధించిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల రుణమాఫీ మూడో విడత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే రెండు విడతలు డ్వాక్రా రుణ మాఫీ జరిగిందని, మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పట్టణ పరిధిలో ఇప్పటి వరకు సుమారు రూ.58కోట్లు డ్వాక్రా రుణమాఫీ జరిగిందని తెలిపారు. మూడో విడతగా నియోజకవర్గంలో రూ.32.55 కోట్లు మంజూరు చేసి నేరుగా డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గం పరిధిలో సుమారు 43 వేలమంది మహిళలకు సుమారు రూ.150 కోట్లు రుణమాఫీ కానుందని తెలిపారు. అంతేకాకుండా రుణాలకు సంబంధించిన వడ్డీ ఎప్పటికప్పుడు మహిళల ఖాతాలలో జమ చేస్తున్నామని చెప్పారు. పేదరికమే ప్రామాణికంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో కేవలం టీడీపీ కార్యకర్తలకే సంక్షేమ ఫలాలు అందించారని విమర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలకు మంచి చేసే ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకునే బాధ్యత మనపై ఉందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తిరిగి అధికారం చేపడితేనే మహిళలకు మరింత మేలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఆసరా మూడో విడతకు సంబంధించి రూ.32.55 కోట్ల మెగా చెక్కును డ్వాక్రా గ్రూపులకు అందించారు. అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, మెప్మా అధికారి రమణారెడ్డి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట ముని వంశీధర్‌రెడ్డి, షేక్ కమాల్ బాషా, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి ఖాజా, ఎర్రబల్లె హిదాయత్, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


బాధితులకు చెక్కు అందజేస్తున్న డీసీ గోవిందరెడ్డి, తదితరులు

బద్వేలు : పేద ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటోందని ఆ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఆయన పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 9 మందికి రూ.7.23 లక్షల విలువైన చెక్కులను అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తోందని, ఆరోగ్యశ్రీని సమర్థంగా అమలు చేయడంతో పాటు పథకం కింద వైద్యం అందని వారికి తోడుగా నిలుస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో దాదాపు 500 మందికి పైగా బాధితులకు సీఎం సహాయనిధి అందిందన్నారు. పేదల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమపథకాలతో అభివృద్ధి దిశగా పయనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో దాదాపు రూ.వెయ్యి కోట్లతో రహదారులు, డ్రైనేజీ కాలువలు, సిమెంట్‌రోడ్లు, నీటి పారుదల పథకాలను చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు దేవసాని ఆదిత్యారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందుకున్నవారు..

పోరుమామిళ్ల మండలానికి చెందిన శెట్టెం శ్రీనివాసులు రూ.లక్ష, కాశినాయన మండలానికి చెందిన ముమ్మడిరెడ్డి విజయశాంతికి రూ.2లక్షలు, బద్వేలు మండలానికి చెందిన ఆవులేటి బాలయ్యకు రూ.1.50 లక్షలు, వాకమళ్ల విజయలక్ష్మికి రూ.1.20లక్షలు, చింతన్‌రెడ్డి మస్తాన్‌రెడ్డికి రూ.45వేలు, అట్లూరుకు చెందిన పరమేశ్వర్ రూ.30వేలు, లక్ష్మిప్రసన్నకు రూ.3వేలు, బి.కోడూరుకు చెందిన బిజివేముల సుబ్బమ్మకు రూ.40వేలు, హరితకు రూ.8వేలు వంతున మంజూరయ్యాయి.

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ


వైఎస్సార్ పోషణ కిట్ అందిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తోందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. మండలంలోని లింగాపురం–1 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా చిరుధాన్యాలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మల్లేల ఝాన్సీరాణి మాట్లాడుతూ చిరుధాన్యాలు రోజూ తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీరజ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వైఎస్సార్ పోషణ కిట్లను అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ రోజా, జీఎంఎస్‌కే కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్షుమ్మ, వెంకటమ్మ, శాంత, సుహాసిని, సుబ్బరత్నమ్మ, భారతి, శశికళ, ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మైక్ సిస్టం వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌కు శనివారం మైక్ సిస్టంను వితరణగా అందచేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా కొర్రపాడు బ్రాంచ్ మేనేజర్ సంతోష్, ప్రొద్దుటూరు బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్ ఇద్దరు కలసి రూ.20 వేల విలువ చేసే మైక్ సిస్టంను అందచేశారు. అలాగే వైరింగ్ ఖర్చులకు రూ.10వేలను కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఆయన కుమారుడు అభిలాష్‌రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురప్ప, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థి ప్రతిభ

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి డి.శివసంతోష్‌కుమార్ జాతీయస్థాయి స్కాలర్‌షిప్ పరీక్షలో అర్హత సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శివకుమార్ తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ప్రత్యేక క్యాంప్

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాలనీలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు పిచ్చిమొక్కలను తొలగించారు. ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సంఘ సేవలో పాల్గొనాలని తెలిపారు. వారం రోజులపాటు కాలనీలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ

కలసపాడు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం ఉంటుందని వెలుగు ఏపీఎం నాయుడు తెలిపారు. మండలంలో 596 స్వయం సహాయక సంఘాలకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.4,17,46,000లు అందించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరవుతారన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

గోపవరం: వేసవిని దృష్టిలో ఉంచుకుని దాహార్తిని తీర్చేందుకు అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ అధికారులను ఆదేశించారు. టీ.సండ్రపల్లె సచివాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బందిని ఆయన అభినందించారు. అన్ని పంచాయతీ కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి అందుకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నందున పనులకు వెళ్ళే కూలీలు తాగునీరు వెంట తీసుకెళ్ళాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయాన్నే పనులకు వెళ్ళి త్వరగా ఇళ్ళకు చేరుకోవాలన్నారు. వృద్ధులు ఎవరు కూడా వేసవికాలం ముగిసే వరకు పనులకు వెళ్ళకపోవడం మంచిదన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి


చల్లగిరిగెలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణారెడ్డి

బద్వేలు : గ్రామ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని బద్వేలు డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని గానుగపెంట, టి.చల్లగిరిగెల, సిద్ధవరం, పుల్లివీడు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సచివాలయాల్లో సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆయా శాఖల వారీగా సూచించిన రికార్డులను ఎప్పటికప్పుడు అన్ని వివరాలతో నిర్వహించాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి వేయాలని, వలంటీర్లు వారంలో నిర్దేశించిన రోజుల్లో అటెండెన్స్ వేయాలన్నారు. సాయంత్రం స్పందన కార్యక్రమానికి సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పన్ను వసూలును ఈ నెలాఖరులోపు వందశాతం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీలు వందశాతం చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణాధికారి భాస్కర్‌బాబు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయండి

- పీఆర్‌ఆర్‌డి ప్రభుత్వ సలహాదారులు నాగార్జునరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న పీఆర్‌ఆర్‌డి ప్రభుత్వ సలహాదారులు నాగార్జునరెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రభుత్వ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అధికారులను కోరారు. శనివారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ప్రజలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించడానికి, శాశ్వతమైన ఆస్తులను సృష్టించడానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు చేపడుతోందని, ఈ పనులన్నింటిని సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు పాలన మరింత మెరుగు కావాలనే ఉద్దేశ్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి ప్రతి పంచాయతీలో సచివాలయ భవనాలను నిర్మించడంతో పాటు రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మిస్తున్నారని, వీటన్నింటిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని, ఇందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఆయన వెంట అట్లూరు మండల సచివాలయ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మంచి పోషకాలు


చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

మైదుకూరు : చిరుధాన్యాలతో గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఉప్పుగుంటపల్లెలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ రాగులు, సజ్జలు, కొర్రలు తదితర ధాన్యాలు తీసుకోవడం వల్ల పోషక విలువలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పొలంబడి సక్రమంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు

అట్లూరు : డాక్టర్ వైఎస్సార్ పొలంబడి సక్రమంగా నిర్వహించి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శనివారం అట్లూరు రైతుభరోసా కేంద్రంలో వీఏఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయంలో సిబ్బంది సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలన్నారు. డ్రెస్‌కోడ్ పాటించాలని, లేనిచో కఠినచర్యలు తప్పవన్నారు. పొలంబడి, రైతుభరోసా, పీఎం కిసాన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశభవిత

- మత్తు పదార్థాల ఆలోచనే ప్రమాదకరం
- వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : ఆదర్శణీయమైన ప్రవర్తన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతో పాటు దేశ ఔన్నత్యానికి బాటలు వేస్తుందని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ జాతీయ, రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు సత్ప్రవర్తన, ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారని, డ్రగ్ ఫ్రీ విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉందన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ 'డ్రగ్ ఫ్రీ కడప' కావాలని ఆకాంక్షించారు. అనంతరం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రోఫిక్ సబ్ స్టాన్సిస్ యాక్ట్–1985 గురించి అవగాహన కల్పించారు. సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ఎ. ప్రభాకర్‌రెడ్డి, రిమ్స్ సైక్రియాటిస్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. వెంకట్రాముడు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. కృష్ణకిశోర్ మాట్లాడుతూ మత్తు రహిత భారతావని యువత వల్లే సాధ్యమవుతుందన్నారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డా. టి. చంద్రశేఖర్, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా. వి. లాజర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీతో చక్కటి ఉపాధి అవకాశాలు


ఫొటోగ్రఫీలో మెళకువలు తెలియజేస్తున్న కెనాన్ ట్రైనర్

ఏఎఫ్‌యూ : ఫొటోగ్రఫీని కెరీర్‌గా ఎంచుకునేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన కెనాన్ ప్రొడీవీ సంస్థ ఫొటోగ్రఫీ శిక్షకుడు పి. అహ్మద్ తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కెనాన్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కరోజు ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు ఫొటోగ్రఫీ వైపు రావడం శుభపరిణామమన్నారు. సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తూ ఆధునిక ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం కెమెరాల్లో వస్తున్న టెక్నాలజీ, వినియోగం, లేటెస్ట్ మోడల్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఫొటోగ్రఫీ కో–ఆర్డినేటర్ సతీష్, అహ్మద్, మెహర్, డా. సంపత్‌కుమార్, ట్రైనర్‌లు ఎస్. పర్వేజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

చాపాడు : మండలం పరిధిలోని టీఓపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత అంకాలమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనుండగా సోమవారం గోపూజ, గణపతి పూజతో వేడుకలు మొదలవుతాయని మంగళవారం చెక్కభజన, కోలాటం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. బుధవారం శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ట వేడుకల సందర్భంగా మూడు రోజుల పాటు గ్రామ ప్రజలు, భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ఉత్సవ వేడుకలు, పూజా కార్యక్రమాలు టి.సుబ్బయ్య శర్మ, సీతారామశర్మల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు లక్ష్మీనరసింహస్వామికి చైత్రమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాహుల్‌గాంధీపై అనర్హత కక్ష సాధింపే

పోరుమామిళ్ల : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం రాజకీయ కక్షలో భాగమేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌పై చిన్న చిన్న కేసులు పెట్టి శిక్షలు వేయించడం ప్రతిపక్షాన్ని ఇబ్బంది పెట్టడమేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు శ్రీను, రఫీ, ముజాహిద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దువ్వూరు : మండలంలోని గుడిపాడు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల వ్యాప్తంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వీరారెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు గమనించాలని ఆయన కోరారు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడిన ఇటుకల ట్రాక్టర్

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు–గోపవరం గ్రామాల మధ్యలో ఆవు సమాధికి సమీపంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఇటుకల ట్రాక్టర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెంకు వెళుతున్న ఇటుకల ట్రాక్టర్, ప్రొద్దుటూరు నుంచి కృష్ణంపల్లెకు వెళుతున్న ఆర్టీసీ బస్సు క్రాస్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లి మోరీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుపాళెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

చిరుధాన్యాలపై అవగాహన


రాజుపాళెం : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలోని ఒకటో సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ పోషకాలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. మహిళా పోలీసు సౌభాగ్యలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీతో ముచ్చటించిన వసతి గృహ విద్యార్థులు


విద్యార్థులకు పుస్తకాలను ఇస్తున్న ప్రధాని

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్సీ వసతి గృహ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కొన్నిరోజుల క్రితం కలిశారు. ఇండియన్ బ్యాంకు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేసింది. ఈ విజ్ఞాన యాత్రకు కడప జిల్లా నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికకాగా ప్రొద్దుటూరు నడింపల్లెలోని ఆనంద నిలయం విద్యార్థి శ్రీనివాసనాయక్, సంజీవనగర్ బాలికల వసతి గృహం విద్యార్థినులు రజిత, నాగ హరిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థుల తో ముచ్చటించి పుస్తకాలను బహూకరించారు. నడింపల్లె ఆనంద నిలయం వసతి గృహ అధికారి నాగరాజు నాయక్ పాల్గొన్నారు.